

మరో అడుగు

– డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'ఆర్థర్ ఆష్' జీవితాన్ని గురించి చదివిన తర్వాత మౌనంగా చాలాసేపు ఉండిపోయిన యశోద ఎప్పుడు చీకటి పడిందో కూడా గమనించలేదు.

"అమ్మా! పడుకోలేదా? నిద్రపోయారనుకున్నాను, అందుకే లోపలకి రాలేదు. టీ కలుపుకుని రానా? లేదా వేడిగా పాలు తాగుతారా?" గదిలోకి వచ్చి లైటు వస్తూ అడిగింది కరుణ.

" ఓ, ఏదో చదివి దాని గురించే ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. బాగా చీకటి పడిపోయిందే? టైము ఎంతయిందో? సార్, పిల్లలు వచ్చారా?" అడిగింది యశోద.

" లేదమ్మా, పాపమ్మ పొద్దున్నే చెప్పారు రాత్రికి ఏదో కొత్త ప్రయోగం చేస్తున్నాము, లేట్ అవుతుంది, భోజనానికి రానన్నారు కదా. బాబుగారు, అయ్యగారూ వస్తూ ఉండవచ్చు. మీరేం తాగుతారో చెప్పనే లేదు అమ్మా!" అంది కరుణ నెమ్మదిగా.

" ఇప్పుడేమీ వద్దులే కరుణమ్మా, ఒకేసారి అందరూ వేడిగా భోంచేద్దాం. కాస్త చేమ దుంపలు వేడిగా వేయించి, ఘాటుగా మిరియాల చారు పెట్టమని చెప్పు. ఆ! అలాగే ఓ గ్లాసుడు చల్లని మంచినీళ్ళు ఇవ్వు " అంది యశోద.

గ్లాస్ నిండా చల్లటి నీళ్ళు, చిన్న ప్లేట్ లో నాలుగు యాపిల్ ముక్కలు పెట్టుకుని రెండు నిమిషాల్లో వచ్చింది కరుణ.

" మధ్యాహ్నం ఎప్పుడో తిన్నారు, రెండు ముక్కలు తినండమ్మా. అయ్యగారు వాళ్ళు వచ్చేటప్పటికి లేట్ అవుతుందేమో!' అంది ఆప్యాయత నిండిన గొంతుతో.

" సరే! నీకోసం తింటాను" అంటూ మంచి నీళ్ళు తాగి ఓ ముక్క చేతిలోకి తీసుకుంది.

"ముఖం కడుక్కుంటారా అమ్మా! కాస్త తేటగా ఉంటుంది. మధ్యాహ్నం కూడా పడుకోలేదు, ముఖం పీక్కుపోయింది"

సరే! అన్నట్టు తలాడించి లేచి చన్నీళ్ళతో ముఖం కడుక్కుని తల దువ్వుకుని బట్టలు మార్చుకునేసరికి కొద్దిగా హాయిగా అనిపించింది యశోదకు. భర్త, కొడుకుల్లో ఎవరు ముందు వస్తారో ? అనుకుంటూ గేట్ వైపు చూస్తూ మెల్లిగా హాల్లో పచార్లు చెయ్యడం మొదలుపెట్టింది. కరుణ కూడా ఆవిడతో పాటే తిరుగుతూ కబుర్లు ఏవో కబుర్లు చెప్పసాగింది.

ఏం జరుగుతోందో పూర్తిగా తెలీదు కానీ ఏదో సరిగా లేదని కరుణకీ తెలుస్తోంది. కానీ పూర్తి వివరాలు తెలియదు, తెలుసుకోవాలని ఉన్నా అడిగేంత ధైర్యం లేదు. ఏమీ జరగకుండా అన్నీ సవ్యం గా ఉంటే చాలు. అమ్మలాంటి అమ్మగారి ముఖాన వెలిగే చిరునవ్వు అలాగే ఉంటే చాలు, అని మనసు లోనే అనుకుంటూ యశోద వెనక నీడలా తిరుగుతోంది కరుణ.

మరో పది నిమిషాల్లో యష్ వచ్చాడు. ఎప్పటిలాగే చేతిలోని కారు తాళాలని పైకెగరేసి పట్టుకుంటూ చురుగ్గా మెట్లెక్కుతూ, ఈల వేసుకుంటూ వచ్చాడు.

వస్తూనే " అమ్మా!" అంటూ యశోద దగ్గరకి వచ్చి చిన్నగా హగ్ చేసుకున్నాడు.

" ఏం చేస్తున్నావ్ యశూ?" అన్నాడు అంతలోకే నవ్వుతూ.

అతనన్న తీరుకి ఫక్కున నవ్వింది కరుణ.

" అన్నా, టీ తెచ్చేదా?" అంది కరుణ, యష్ వైపు చూస్తూ.

" యస్ కరుణా! నాకూ, మన యశూకి కూడా" అన్నాడు యశోద భుజం మీద చెయ్యి వస్తూ.

" అమ్మ వద్దన్నారు, మీకొక్కరికే!" అంటూ వంటింట్లోకి పరిగెత్తింది కరుణ.

" అయ్య కూడా వచ్చేస్తూ ఉంటారు, మరొక కప్పు తయారు చేసి ఉంచు" అంది యశోద లోపలకి వెళ్తున్న కరుణ వైపు చూస్తూ.

మరో పది నిమిషాల్లో కేశవరావ్ కూడా వచ్చారు.

పల్చగా, పొడవుగా ఉన్న ఆయన చేతివేళ్ళ మధ్యన పచ్చని కవర్. కవర్ లో రిపోర్ట్. అది స్పష్టంగా చెప్పిన నిజం. అందరినీ కలచివేసిన నిజం. ఎవరినీ కుదురుగా ఉండనివ్వని నిజం.

ఊపిరితిత్తుల్లో మొదలైన క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు కూడా వ్యాపించినట్లు సూచిస్తున్న స్కాన్.

క్యాన్సర్ మెదడు, కిడ్నీ మరియు చేతుల ఎముకల వరకు చేరినట్లుగా స్పష్టంగా చూపిస్తున్నాయి.

అందువల్ల దీనిని స్టేజ్ 4 లంగ్ క్యాన్సర్ గా పరిగణిస్తున్నారు అని రాసిన రిపోర్ట్.

ఆ క్యాన్సర్ ఏ రకమైన ఊపిరితిత్తుల క్యాన్సర్ (ఉదా: Adenocarcinoma, Squamous Carcinoma, Small cell lung carcinoma మొదలైనవి) అనేది తెలుసుకోవడానికి బయాప్సీ/పాథాలజీ పరీక్ష ఫలితాలు అవసరం అని వివరంగా రాసి ఉంది.

తండ్రి చేతిలోంచి ఆ రిపోర్ట్ తీసుకుని చదివిన యశ్ కూడా ఏమీ తోచనట్టు ఉండిపోయాడు.

మరుక్షణం ఫోన్ చేతిలోకి తీసుకుని బాల్కనీ లోకి వెళ్ళి చెల్లెలికి ఫోన్ చేసి మాట్లాడసాగాడు.

" నాన్న ఫోన్ చేశారు అన్నా! కొద్దిగా విషయం చెప్పారు. మరో గంటలో ప్రస్తుతం చేస్తున్న ప్రయోగాన్ని నా కొలీగ్ శీతల్ కి అప్పచెప్పి వచ్చేస్తాను. అప్పుడు వివరంగా మాట్లాడదాం" అంది యామిని.

సరేనంటూ కాల్ ముగించి మళ్ళీ హాల్ లోకి వచ్చాడు యశ్.

మౌనంగా కూర్చున్న తల్లి తండ్రులని చూస్తూ నిలబడ్డాడు క్షణం సేపు.

' అత్యంత సాధారణంగా కనిపించిన దగ్గు, భుజం నొప్పి, ఛాతి నొప్పి ఎలా 4వ దశ క్యాన్సర్‌గా మారింది? ఇంత త్వరగా మారిందా? ఇన్నాళ్ళూ తమకు తెలియనే లేదా? అది నెలల తరబడి, లేదా సంవత్సరాలపాటు కూడా ఎలాంటి లక్షణాలు పైకి కనబడనీయకుండా ఎలా దాగి ఉండగలిగింది? ఇటీవలి వరకు ఆమెకు పెద్దగా ఏ లక్షణాలు ఎందుకు కనిపించలేదు? ఇంత పెద్ద సమస్య ఇప్పుడు ఒక్కసారిగా, హఠాత్తుగా ఎలా బయటపడింది? '

ఎన్నో ప్రశ్నలు వారి మనసుల్లో తిరుగుతున్నాయి. కానీ వాటికి ఎవరి దగ్గరా సమాధానాలు లేవు.

అందరూ ఒకచోట కూర్చొని ఏమి చేయాలో, ఏమి మాట్లాడాలో, ఎలా స్పందించాలో కూడా అర్థం కాక నిశ్శబ్దంగా ఉండిపోయారు.

యశోద వెంటనే ఏదో తోచినట్టు తన ఫోన్ తీసి, బెడ్ రూం లోకి వెళ్ళి తన అక్క రోహిణికి ఫోన్ చేసి బిగ్గరగా ఏడవడం ప్రారంభించింది.

కట్టలు తెంచుకున్న నదిలా కొన్ని క్షణాల పాటు అలాగే, చిన్న పిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆ క్షణాన ఆమెకి తాను అంతక్రితం వరకూ చదివిన వ్యాసాలు, తనను తాను సంభాళించుకునే ప్రయత్నాలు, ఇవేమీ గుర్తు రాలేదు యశోదకి.

ఆ సమయంలో కేశవ్ గానీ, యశ్ గానీ ఆమెను ఆపడానికి ప్రయత్నించలేదు.

'ఆమె హృదయంలో ఉన్న బాధ బయటకు రావాల్సిందే!' అనుకుని మౌనంగానే ఉండిపోయారు.

" నాన్నా! దొడ్డమ్మ కొన్ని రోజులు అమ్మకి తోడుగా ఉండడానికి రాగలరా? అడుగుదామా? అమ్మకి ఈ సమయంలో అది ఎంతో అవసరం అనిపిస్తోంది నాకు. అమ్మమ్మా, తాతగార్లు పోయిన తర్వాత సిస్టర్స్ ఇద్దరూ ఒకరికొకరుగా ఉండడం మనకి తెలుసు కదా! ఐ థింక్ షి విల్ ఫీల్ బెటర్. తను వస్తానంటే, నేను వెళ్ళి తీసుకొస్తాను" అన్నాడు యష్.

కేశవరావ్ మౌనంగా తల పంకించారు.

లోపలనించి వినిపిస్తున్న భార్య గొంతు ఆయన గుండెని కలచివేస్తోంది.

యశోద ఫోన్‌లో రోహిణితో మాట్లాడుతూ, గట్టిగా ఏడుస్తూ, మాటల మధ్యలో బరువుగా ఊపిరి పీలుస్తూ విషయాలన్నీ చెప్తోంది.

ఆమెను ఓదార్చే స్థితిలో వాళ్లు లేరు. ఎందుకంటే జరిగిన విషయాన్ని తామే ఇంకా జీర్ణించుకోవడానికి కొంత సమయం కావాల్సి వచ్చేటట్టుంది.

అంతలో యామిని కూడా వచ్చింది.

అన్నయ్య చెప్పిన దాన్ని బట్టి కొంత వరకూ విషయాన్ని గ్రహించింది. అయినా సరే, అన్నా, నాన్నలు ఏమీ తోచనట్టు మౌనంగా ఉండిపోవడాన్ని, లోపల గదిలోంచి వినిపిస్తున్న తల్లి గద్గద స్వరాన్ని విని కాస్త కంగారు పడింది.

మరి కొంతసేపటి తర్వాత యశోద తన ఫోన్ కాల్‌ను ముగించింది.

మెత్తటి తన చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ వచ్చి కేశవరావ్ పక్కనే కూర్చుని ఆయన భుజం పైన చెయ్యి వేసింది. అప్పుడు నెమ్మదిగా చెప్పింది.

" సారీ మీ ముగ్గురినీ కంగారు పెట్టాను కదా! ఎందుకో ఆపుకోలేక పోయాను. హఠాత్తుగా అక్కే గుర్తుకు వచ్చింది. దాంతో మాట్లాడితే కానీ మనసు కుదుట పడదేమో అన్నంత గాభరా వచ్చింది. వెంటనే బయలుదేరి వస్తానంది. రాజీవ్ వెంటనే టికెట్ బుక్ చేశాడు కూడా!" అంది.

" వెరీ గుడ్ అమ్మా! నేనూ అదే అన్నాను నాన్నతో. దొడ్డమ్మ వస్తే బావుంటుంది అని. నేను ఎయిర్ పోర్ట్ కి వెళ్ళి దొడ్డమ్మని తీసుకుని వస్తానని రాజీవ్ అన్నతో చెప్తాను" అన్నాడు యష్.

ఆమె మరుసటి ఉదయానికి చేరుకుంటుంది అన్న భావనే యశోదకి బలంగా అనిపిస్తోంది

కొంత సేపటికి వాతావరణం కాస్త మామూలయింది.

భోజనలయ్యాకా స్థిమితపరచుకున్న మనసుతో కేశవ్ ఆ వార్తను యామినికీ తెలిపాడు.

ఆ తరువాత రిపోర్టులను తన ఇద్దరు పిల్లలకు కూడా చూపించాడు. ఆయన భుజం మీద తల వాల్చుకున్న యశోద ఏమీ వినే స్థితిలో లేదు.

అతను ముగ్గురినీ తన చేతుల్లోకి దగ్గరగా తీసుకుని గట్టిగా కౌగిలించుకొని,

“మనమంతా ఒక కుటుంబంగా కలిసి దీనిని ఎదుర్కొందాం... ఒకో అడుగు వేస్తూ, ఒకో సమస్యను ఒక్కోసారి పరిష్కరిద్దాం.” అన్నాడు.

కానీ ఆ రాత్రి యశోదకు ఏ మాటా ఓదార్పునివ్వలేకపోయింది. ఆమెకు నిద్ర కూడా పట్టలేదు.

ఎప్పుడూ అతిథులతో, ప్రేమాభిమానాలతో కళకళలాడే ఆ ఇల్లు ఒక్కసారిగా గాఢమైన విషాద ఛాయలతో కమ్ముకున్నట్లనిపించింది.

ఆనందం, సంతోషం అన్నీ క్షణాల్లో మాయమైపోయి, ఇల్లంతా దిగులు మాత్రమే మిగిలినట్టయింది.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments